క్లుప్తంగా

ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



ప్రత్తిపాడు: పదహారో నంబరు జాతీయ రహదారిపై పార్వతీపురం సమీపంలో కొలువుదీరిన ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం 32వ వార్షిక తిరునాళ్ల మహోత్సవం మంగళవారం జరిగింది. ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అనంత లక్ష్మీ స్పిన్నింగ్ మిల్స్ సహకారంతో జరిగిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు.

చెత్త రహిత గ్రామాలే లక్ష్యం



కాకుమాను: చెత్త రహిత గ్రామాలే లక్ష్యమని ఎంపీడీఓ పి.రామకృష్ణ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పారిశుద్ధ్య కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు వ్యర్థాలను సేకరించి వేరు చేసి డంపింగ్ యార్డులో తరలించాలని సూచించారు. చెత్తను వేరుచేయడాన్ని ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో సర్పంచ్ పసుపులేటి శివకుమారి పాల్గొన్నారు.

అవయవ దానంతో చిరంజీవులు



గుంటూరు రూరల్: అవయవ దానంతో చిరంజీవులం కావచ్చని గుంటూరు మెడికల్ కళాశాల నెఫ్రాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.శివరామకృష్ణ తెలిపారు. మంగళవారం నగర శివారు లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో అవయవ దానంపై అవగాహన సదస్సును నిర్వహించారు. అవయవ దానం ప్రాముఖ్యాన్ని వివరించారు. అవయవాలు దానం చేయాలనుకునే వారు నేరుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జీవన్‌దాన్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ కె.ఎస్.రజనీకాంత్ అతిథులను సన్మానించారు.

గ్రామీణ విత్తన పథకంతో మేలైన వంగడాలు

పెదకాకాని: రైతులకు మేలైన వరి వంగడాలు సమకూర్చడమే ప్రభుత్వ గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం లక్ష్యమని గుంటూరు జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.హైమావతి చెప్పారు. ఉప్పలపాడు, రామచంద్రపాలెం గ్రామాల్లో గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకంపై మంగళవారం రైతులకు శిక్షణ నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి అధ్యక్షత వహించారు. హైమావతి మాట్లాడుతూ వ్యవసాయ గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం గురించి వివరించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి, వ్యవసాయ విస్తరణ అధికారి ఆర్.వి.శివాజీ, ఉప్పలపాడు వీఏఏ పి.వి.జోత్స్న, గ్రామ సర్పంచ్ కర్నాటక శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

ఆలయ భూమి వివాదం

పొన్నూరు: పట్టణంలోని శ్రీరామ మందిరానికి సంబంధించిన భూమి విషయంలో ఇరు వర్గాల మధ్య వివాదం నెలకొంది. ఆలయ భూమి ఆక్రమణకు గురైందని కమిటీ సభ్యులు కోర్టుకెళ్లడంతో కోర్టు ఆదేశాల మేరకు పొన్నూరు సర్వేయర్ సత్యనారాయణ ఆలయానికి సంబంధించిన స్థలాన్ని మంగళవారం సర్వే చేశారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. సమస్యపై విచారణ చేసి పరిష్కారిస్తామని సర్వేయర్ తెలిపారు.

పీహెచ్‌సీకి పరికరాలు అందజేత

మంగళగిరి: నగర పరిధిలోని కుంచనపల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌కు రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో మంగళవారం రూ.3 లక్షల 50 విలువైన పరికరాలు అందజేశారు. ఏసీ, ఫ్రిడ్జ్, కుర్చీలు, డోర్ కర్టన్స్, దిద్దు, జిరాక్స్ మిషన్, ఇన్వర్టర్, ర్యాక్స్‌లు అందజేశారు. ప్రజలకు సేవలు అందించడంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ముందుంటుందని గవర్నర్ అన్నే రత్నప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు రావూరి రమేష్ బాబు, రవీంద్రారెడ్డి, మున్నంగి వివేకానంద రెడ్డి, కాట్రగడ్డ శివన్నారాయణ, శెట్టి రామకృష్ణ, జంగాల వెంకటేష్; చొప్పర బుల్లిబాబు, శ్రీలత, కొండపాటి నరేంద్ర, రావర్ల శ్రీనివాసరావు, శంకరశెట్టి రమేష్ పాల్గొన్నారు.

ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ల బృందం పర్యటన

ప్రత్తిపాడు: మండల పరిధిలోని నడింపాలెం గ్రామ పంచాయతీలో మంగళవారం ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ల బృందం పర్యటించింది. తొలుత స్థానిక షెడ్‌లో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు బి.పావని, ఎస్.ఆయేషా, సంగీత్ మధుర్, ఎం.కృష్ణమూర్తి, ఎం.బి.ప్రకాష్ రెడ్డి, జి.భానుశ్రీ,, కె.లక్ష్మీప్రసన్న, కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డిలు మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ (ఎస్‌డబ్ల్యూపీసీ)లో జరుగుతున్న వర్మీ కంపోస్టు, ఎరువుల తయారీ, తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధానాలను పరిశీలించారు. తదనంతరం గ్రామంలోని అంతర్గత వీధుల్లోకి వెళ్లి చెత్త సేకరణ విధానాన్ని గమనించారు. గ్రామంలో చెత్త సేకరించే విధానంతో పాటు, సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌కు తరలించే పద్ధతి,



నడింపాలెంలో చెత్త సేకరణ విధానాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ల బృందం

అక్కడ తడిచెత్త పొడి చెత్త వేరుచేసే విధానం, క్లాప్ మిత్ర, గ్రీన్ అంబాసిడర్‌ల విధులు, గ్రామ స్వచ్ఛతకు అమలు చేస్తున్న పద్ధతులను ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ షేక్ ఖాజాను అడిగి తెలుసుకున్నారు. చెత్త సేకరణ నుంచి ఎరువుగా తయారు చేయడం వరకు పాటిస్తున్న ఆయా పద్ధతులపై రోజా ప్రకాష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ల బృందానికి వివరించారు. వర్మీకంపోస్టును మార్కెటింగ్ చేసే పద్ధతిని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. తదనంతరం గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించి అక్కడ అందుతున్న సేవలు, అందుబాటులో ఉన్న సేవల వివరాలను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వారివెంట పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం నుంచి ఫెసిలిటీస్ కో–ఆర్డినేటర్లు ఎ.మహేంద్ర రెడ్డి, ఎం.రాజశేఖర్ డిస్ట్రిక్ట్ పంచాయతీరాజ్ రిసోర్స్ సెంటర్ డీఆర్‌పీ అనూరాధ, ఇన్‌చార్జి ఎంపీడీఓ రామకోటయ్య, స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కో–ఆర్డినేటర్ డబ్బూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల అభ్యున్నతికి కృషి చేద్దాం

ప్రత్తిపాడు: మహిళా సంఘాల అభ్యున్నతికి ప్రజా ప్రతినిధులు, ప్రజలు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఏపీఎం జి.సురేష్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఏపీఎం సురేష్‌కుమార్ స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాల ఏర్పాటు, రిజిస్ట్రేషన్, గ్రామ సంఘాల ద్వారా నిర్వర్తించే పనులు, మండల సమాఖ్య విధివిధానాలు వంటి అంశాలపై సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చారు. అనంతరం ఐటీసీ కో–ఆర్డినేటర్ ఉమామహేశ్వరి పారిశుద్ధం, ఘన, వ్యర్థాల నిర్వహణపై, వాటర్ ఎయిడ్ సంస్థ ప్రతినిధులు సాయి జలజీవన్ మిషన్, స్వచ్ఛమైన తాగునీరు.. వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ఉండేలా చూడాలన్నారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై నిర్వహించే గ్రామసభల్లో



సర్పంచ్‌ల శిక్షణలో మాట్లాడుతున్న ఏపీఎం సురేష్‌కుమార్, వేదికపై ఎంపీపీ దాసరి అన్నమ్మ

ప్రాధాన్య క్రమంలో పనులను ఎంచుకోవాలని సూచించారు. అనంతరం సర్పంచ్‌లు, సెక్రటరీలు నడింపాలెంలోని సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్‌ను ఫీల్డ్ విజిట్ చేశారు. అక్కడ జరుగుతున్న చెత్త సేకరణ, ఘన వ్యర్థాల నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అన్నమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీవో రామకోటయ్య, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా, సర్పంచ్‌లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు

గుంటూరు రూరల్: స్నేహపూరిత వాతావరణంలో సాగే విద్యాభ్యాసం విద్యార్థి ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలుకుతుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె మద్దినేని పేర్కొన్నారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో జాతీయ ర్యాగింగ్ వ్యతిరేక దినం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ర్యాగింగ్ వల్ల అనర్థాలను వివరించారు. అనంతరం కళాశాల విద్యార్థులు, అధ్యాపక బృందం కళాశాల కూడలిలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ విద్యార్థులతో ర్యాగింగ్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, కళాశాల డైరెక్టర్ రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎమ్ సత్యసాయిరామ్ పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్ తదితరులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని సీబీసీ గుంటూరు క్షేత్ర అధికారి ఆర్.శరశ్చంద్ర తెలిపారు. మంగళవారం పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆఫ్ ఇండియా, కళాశాల సంయుక్తాధ్వర్యంలో ఒక మొక్క అమ్మ పేరిట (ఏక్ పేడ్ మా కే నామ్) కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణలో వివిధ రకాల పండ్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శరశ్చంద్ర మాట్లాడుతూ పర్యావరణ ప్రాముఖ్యాన్ని వివరించారు. అనంతరం విద్యార్థుల చేత హరిత ప్రతిజ్ఞ చేయించారు, మొక్కల పెంపకం, ఇంధన పొదుపు, రీసైక్లింగ్ సమాజంలో వ్యర్థాలను తగ్గించడం గురించి వివరించారు.



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న యాజమాన్య ప్రతినిధులు

మొక్కలు నాటే కార్యక్రమంలో విజ్ఞాన్ నిరుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి రాధిక, కళాశాల ఎన్‌సీసీ అధికారిణి జ్యోతిప్రియ పాల్గొన్నారు.

జీరో ఎనర్జీ కూల్ చాంబర్ నిర్మాణంపై అవగాహన

పెదకాకాని: రైతులు జీరో ఎనర్జీ కూల్ చాంబర్‌పై అవగాహన పెంచుకోవాలని గ్రామ సర్పంచి ఆలా సాంబశివరావు చెప్పారు. పెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామంలో మంగళవారం విజయవాడ కేఎల్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల విద్యార్థులకు జీరో ఎనర్జీ కూల్ చాంబర్ నిర్మాణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి ఆలా సాంబశివరావు మాట్లాడుతూ జీరో ఎనర్జీ కూల్ చాంబర్ నిర్మాణం, ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమంలో వీఏఏ భవాని, విద్యార్థులు జగదీశ్‌రెడ్డి, హేమంత్, ఉదయ్ కుమార్, సాయి, శేషు, హేమవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



కొప్పురావూరులో మాట్లాడుతున్న సర్పంచి ఆలా సాంబశివరావు, విద్యార్థులు

విద్యుత్ సర్వీసుల తనిఖీ

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని 2,420 విద్యుత్‌సర్వీసు మీటర్లను విద్యుత్ మంగళవారం తనిఖీ చేసినట్లు జిల్లా సీఆర్‌డీఏ సూపరింటెండెంట్ సర్కిల్ ఇంజినీర్ డాక్టర్ పి.విజయకుమార్ తెలిపారు. స్థానిక అల్లంవారిపాలెంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 37 బృందాలు తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. 54 సర్వీసులకు అదనపు లోడు కింద అపరాధ రుసుం రూ.2 లక్షల16 వేలు వసూలు చేసినట్లు తెలిపారు. 300 యూనిట్లు లోపు వాడుతున్న విద్యుత్ వినియోగదారులు పీఎం సూర్యఘర్ పథకం కింద ప్రతి ఇంటికి సౌర పలకలు అమర్చుకోవాలని అవగాహన కల్పించినట్లు చెప్పారు. దీనికి కేంద్ర ప్రభుత్వం రూ.78 వేల రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ సీహెచ్, రమేష్, డీపీఈ మూర్తి, ఎంఅండ్ పీ ఈఈ సింగయ్య, ఏఈ పుల్లారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సీఆర్‌డీఏ సూపరింటెండెంట్ సర్కిల్ ఇంజినీర్ విజయకుమార్

నామినేటెడ్ పోస్టులలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

మంగళగిరి: కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పోస్టులలో అధిక భాగం బీసీలకే కేటాయించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని జాతీయ రహదారి వెంట ఉన్న సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో కీలకంగా మారిన బీసీలకు నామినేటెడ్ పదవులతో న్యాయం చేయాలన్నారు, ఎన్నికల హామీలో చంద్రబాబు బీసీ 30 శాతం రిజర్వేషన్ ఇస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. 54 శాతం ఉన్న బీసీ 54 శాతం పదవులు కేటాయించాలన్నారు. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు, గీత, నేత, కుమ్మరి, కమ్మరి, రజక, నాయీ బ్రాహ్మణ వృత్తిదారులకు బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లిక్కర్ షాపులలో 20 శాతం ఉద్యోగాలు కేటాయించాలని కోరారు. విలేకరుల సమావేశంలో సంఘం ప్రతినిధులు కుమ్మరి క్రాంతికుమార్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, పారేపల్లి మహేష్, నాగార్జున, ముప్పన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

16న బాజీషాహిద్ దర్గాలో తలనీలాల వేలం

లక్ష్మీపురం: గుంటూరు జిల్లా పెద్ద కాకానిలో వేంచేసి ఉన్న హజరత్ బాజీ షాహిద్ ఔలియా బాబా వారి దర్గాలో గత పది నెలలుగా నిలువ ఉన్న భక్తుల తలనీలాలకు వేలం వేయనున్నట్లు హజరత్ బాజీ షాహిద్ దర్గా కార్యనిర్వహణ అధికారి ముక్తార్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16వ తేదీన శుక్రవారం కాకాని బాజీ షాహీద్ ఔలియా వారి దర్గా ఆవరణలో గల కార్య నిర్వహణ అధికారి కార్యాలయం వద్ద వేలం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎక్కువ మొత్తంలో వేలంలో పాల్గొన్న వారికి రసీదు ఇవ్వబడుతుందని ఆయన తెలిపారు.

మన్నవ పంచాయతీ కార్యాలయం మార్పు

పొన్నూరు: మన్నవ పంచాయతీ కార్యాలయాన్ని అనధికారికంగా మార్పు చేశారని సర్పంచ్ బొనిగల నాగమల్లేశ్వరరావు ఆరోపించారు. ఏళ్ల తరబడి గ్రామ నడిబొడ్డున ఉన్న భవనంలో కొనసాగుతున్న కార్యాలయాన్ని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, పంచాయతీ తీర్మానం కూడా ప్రవేశ పెట్టకుండా మార్చడమేంటని ప్రశ్నించారు. గ్రామానికి చెందిన కొందరు స్వప్రయోజనాల కోసం తమ ఇళ్లకు దగ్గరగా కార్యాలయాన్ని మార్చడం దారుణమని అన్నారు. పంచాయతీకి సంబంధించిన విలువైన రికార్డులు ఉన్నాయని, వాటి భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారని అన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి, ఈవో పీఆర్‌డీని ఫోన్‌లో సంప్రదించగా వారు స్పందించలేదు.

పొన్నూరు ఎంపీడీఓగా శ్రీనివాసరావు

పొన్నూరు: పొన్నూరు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతానికి బదిలీపై వెళ్లిన శ్రీనివాసరావు మళ్లీ పొన్నూరు ఎంపీడీఓగా చేరారు. ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్న రత్నజ్యోతి బదిలీ అయ్యారు.

ప్రభుత్వం మారితే ప్రొటోకాల్ మారుతుందా?

అధికారులకు వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ విప్పాల కృష్ణారెడ్డి ప్రశ్న

ప్రత్తిపాడు:రాష్ట్రంలో అధికారం మారితే ప్రొటోకాల్ కూడా మారిపోతుందా అని వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ విప్పాల కృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో అధికారులను ప్రశ్నించారు. ఇటీవల ప్రత్తిపాడు మండలంలో జరుగుతున్న ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు జెడ్పీటీసీకి సమాచారం ఇవ్వకుండా ఆయా శాఖల అధికారులు ప్రొటోకాల్‌ను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. అధికారులు తీరు మార్చుకోవాలని హితవు పలికారు.

స్వాతంత్య్ర ఉద్యమ స్ఫూర్తి అవసరం

మేడికొండూరు: మండల పరిధిలోని విశదల అడ్డరోడ్డు వద్ద ఉన్న ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం స్వాతంత్ర్యోదమంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఇంజినీర్ హనుమంతరావు మాట్లాడుతూ వ్యాపారం చేసేందుకు భారత దేశానికి వచ్చిన విదేశీయులు దేశాన్ని ఆక్రమించి పాలించే స్థాయికి ఎదిగారన్నారు. 1857 సిపాయిల తిరుగుబాటులో, 1942లో క్విట్ ఇండియా ఉద్యమం వరకు పలు రకాల ఉద్యమాల వల్లే మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నారై విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాస్, ఏఓ సీతారామయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరిరావు పాల్గొన్నారు.

జ్వరాలపై ఇంటింటి సర్వే చేపట్టండి

డీఎంహెచ్ఓ విజయలక్ష్మి

చేబ్రోలు: వడ్లమూడి గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరం ఉన్న అనుమానితులకు పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యశాఖాధికారిణి డాక్టర్ విజయలక్ష్మి చెప్పారు. వడ్లమూడి గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంప్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. స్థానిక పరిస్థితులపై ఆరా తీశారు. మరికొద్ది రోజుల పాటు మెడికల్ క్యాంపును కొనసాగించాలని సూచించారు. అనుమానితులకు పరీక్షలు నిర్వహించాలన్నారు. వైద్యులకు, పారా మెడికల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి కె.బాబురావు, జోనల్ మలేరియా అధికారి వీరయ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వడ్లమూడి గ్రామంలో వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్ఓ విజయలక్ష్మి

బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్

పొన్నూరు: పొదుపు సంఘాల మహిళలు బ్యాంకులు అందించే రుణాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో మండలస్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళాభ్యున్నతి కోసం స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి బ్యాంకుల ద్వారా వారికి రుణాలు అందిస్తోందని చెప్పారు. దీంతోపాటు బ్యాంకులు టైలరింగ్, బ్యూటీపార్లర్, మగ్గం వర్క్, జ్యూట్ వస్తువుల తయారీ వంటి అనేక అంశాలలో మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాయని, ఈ అవకాశాలను వినియోగించుకోవాలని తెలిపారు. శిక్షణ అంశాలపై గ్రామాల్లో ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని బ్యాంకు అధికారులకు సూచించారు. సమావేశంలో నాబార్డు డీడీఎం శరత్, ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి, మండలాల బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది, డీఆర్‌డీఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరిహరనాథ్

20 నుంచి ఓటరు జాబితా సవరణపై ఇంటింటి సర్వే

పొన్నూరు: సమరీ 2025 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుంచి ఓటరు జాబితా సవరణపై ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు ఈఆర్‌ఓ హరిహరనాథ్ తెలిపారు. మంగళవారం పొన్నూరు మున్సిపల్ కార్యాలయంలో ఓటరు జాబితా సవరణపై సూపర్‌వైజర్లు, ఏఈఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈఆర్‌ఓ మాట్లాడుతూ అక్టోబర్ 18 వరకు ఇంటింటి సర్వే జరుగుతుందని ఓటర్లు తమ ఓటులో మార్పులు, చేర్పులు, బదిలీ, తీసివేయడం, నూతన పేర్లు చేర్చడం వంటి అనేక అంశాలలో ఇంటింటి సర్వే జరుగుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అక్టోబర్ 29న ముసాయిదా జాబితా ప్రచురించబడుతుందన్నారు. 2025 జనవరి 6న తుది జాబితా ప్రకటిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఏఈఆర్‌ఓ సిఎంఈ నయీం అహ్మద్, ఫణికుమార్, తహశీల్దార్ రత్నం, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌వో హరిహరనాథ్

మధ్యాహ్న భోజన కార్మికులపై వేధింపులు ఆపాలి

పొన్నూరు: మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై వేధింపులు ఆపాలని మధ్యాహ్న భోజన పథకం యూనియన్ (సీఐటీయు) జిల్లా గౌరవాధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పొన్నూరు సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చిరుద్యోగులపై రాజకీయ వేధింపులకు పాల్పడటం తగదని పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని, పెరుగుతున్న ధరలకు తగ్గట్టు కార్మికుల జీతాలు, మెనూ చార్జీలు పెంచాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం యూనియన్ మండల అధ్యక్షులు విజయలక్ష్మి మాట్లాడుతూ గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. అనంతరం సీఐటీయూ కార్యాలయం నుంచి ఎంఈఓ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఎంఈఓ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు.



ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న లక్ష్మీనారాయణ, కార్మికులు

పత్తికి రసం పీల్చే పురుగుల బెడద

లాం ఫాం ప్రిన్సిపల్ సైంటిస్ట్, ఏరువాక కేంద్ర కో–ఆర్డినేటర్ నగేష్

ప్రత్తిపాడు: పత్తి పొలాల్లో రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందని లాం ఫాం ప్రిన్సిపల్ సైంటిస్ట్, ఏరువాక కేంద్ర కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నగేష్ చెప్పారు. వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులో మంగళవారం లాం ఫాం శాస్త్రవేత్తలు పర్యటించారు. రైతులు పాలూరి సింగారావు, పాలేటి రామారావు సాగు చేసిన పత్తి పొలాలను మంగళవారం స్థానిక వ్యవసాయశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. రసం పీల్చే పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను లాం ఫాం ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎం.నగేష్, క్రాప్ ప్రొడక్షన్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.వెంకటలక్ష్మి రైతులకు వివరించారు. 35 రోజులు దాటిన తరువాత పత్తి పంటలో ఎకరాకు 20 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. కాన్ఫిడార్ 0.05–0.1 మిల్లీలీటరు ఒక లీటరు నీటిలో, రీజెంట్ 400 ఎంఎల్ ఒక లీటరు నీటిలో, మోనోక్రోటోఫాస్, ఉలాలా 80 గ్రాములు ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఫలితంగా రసం పీల్చే పురుగుల ఉధృతిని తగ్గించుకోవచ్చని సూచించారు. వెంట ఏవో కాసరగడ్డ లక్ష్మి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కొర్నెపాడులో పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు నగేష్, వెంకటలక్ష్మి తదితరులు

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం చేసుకోవద్దు

ఐద్వా సెక్రటరీ రమాదేవి

ప్రత్తిపాడు: యువత డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని ఐద్వా సెక్రటరీ డాక్టర్ ఎ.రమాదేవి హెచ్చరించారు. ప్రత్తిపాడు మండలం యనమదల కిట్స్ అక్షర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మంగళవారం డ్రగ్స్, మద్యపానం వల్ల ఎదురయ్యే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐద్వా (ఆల్ ఇండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్) సెక్రటరీ డాక్టర్ ఎ.రమాదేవి హాజరయ్యారు. రమాదేవి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కొందరు విద్యార్థులు, యువకులు డ్రగ్స్‌కి అలవాటు పడి జీవితాలు పాడుచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యపానం, డ్రగ్స్ తీసుకోవడం వల్ల అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామకోటయ్య, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న రమాదేవి

అంతర్జాతీయ తైక్వాండో పోటీలకు కిట్స్ విద్యార్థి

ప్రత్తిపాడు: అంతర్జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు కిట్స్ కళాశాల విద్యార్థి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు తెలిపారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (కిట్స్)లో ఐటీ విభాగానికి చెందిన బి.మణికంఠ సింగ్ 2024 డిసెంబరులో అంతర్జాతీయ స్థాయిలో మలేసియాలో జరగనున్న తైక్వాండో పోటీల్లో భారతదేశం తరపున ఆడేందుకు ఎంపికైనట్లు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రకటించిందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇప్పటికే మణికంఠసింగ్ 2019లో తైక్వాండో విభాగంలో తలపడి పది సార్లు జిల్లాస్థాయిలో, ఒకసారి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడని చెప్పారు. అంతేకాకుండా 2020లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో సత్తాను చాటి రజత పతకం, 2021లో బంగారు పతకం సాధించాడని వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో భారత్ తరపున ఆడేందుకు ఎంపికైన మణికంఠ సింగ్‌ను మంగళవారం స్థానిక కళాశాలలో చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, క్రీడాచార్యులు కె.వెంకట్రావు, సీహెచ్ విశ్వనాథ్‌సాయి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబులు అభినందించారు.

